

2 లో..

## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం..

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
ఆదివారం 7 జూన్ 2026 పేజీలు : 14






## కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశ కరపత్ర ఆవిష్కరణ

పానగల్ రోడ్డు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

జులై 5 న జరిగే నల్గొండ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం విజయవంతం చేయాలి

నల్గొండ జిల్లా కుమ్మర్లందరూ ఐక్యమత్యంతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలి

తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం

నల్గొండ జిల్లా కన్వీనర్ రాధారపు బిక్షపతి, కో - కన్వీనర్ గంగాధర వెంకటేశ్వర్లు

3 లో..

# పిల్లల భద్రత, విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్తు**

నల్గొండ జూన్ 06(ప్రజాజ్యోతి ప్రతినిధి):

పిల్లలు సురక్షితంగా ఉంటేనే సమాజం సురక్షితంగా ఉంటుందని, ప్రతి తల్లి-తండ్రి పిల్లల భద్రత, విద్య, విలువల పెంపకానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్తు అన్నారు. శనివారం ఆమె కనగల్లు మండలం, చెర్లగౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల పంచాయతీ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు.

5 లో..




## లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ మహమూద్



మిర్యాలగూడ ఇంటిలో అధికారుల విస్తృత సోదాలు

2





8

## ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి కలెక్టర్ ఆరా

అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి

రోగుల అవసరాలకు అనుగుణంగా విభాగాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

6



## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం..

### – మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

**హాలియా,జూన్6(ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా శనివారం హాలియా పురపాలక సంఘం పరిధిలోని 6,7,8 వార్డుల ప్రత్యేక సమావేశం వీబినగర్ నందు మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్స్ నిర్వహించి ప్రధాన రహదారుల వెంబడి వ్యర్ధాలను పూర్తిగా తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు జూట్ (జనపనార) గుడ్డ సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంగరాల యేసు రాజు, మహమ్మద్ గౌహర్ జబీన్ మజహర్ మొహినుద్దీన్,చెరుపల్లి ముత్యాలు,మండల విద్యాధికారి, విద్యుత్ శాఖ ఏఈ,పట్టణ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, చీదళ్ళ లింగయ్య,వెర్మటి వెంకటరెడ్డి,పాండు నాయక్, పొదిల కృష్ణ,నసీరుద్దీన్ స్వయం సహాయక సంఘాలు,ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ మహమూద్

**మిర్యాలగూడ ఇంటిలో అధికారుల విస్తృత సోదాలు**

**మిర్యాలగూడ, జూన్ 06,( ప్రజాజ్యోతి ):**

లంచం తీసుకుంటూ ఓ ప్రభుత్వ అధికారి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన సంఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడలో శనివారం కలకలం రేపింది. ఏసీబీ అధికారులు వల పన్ని వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ ను అరెస్ట్ చేసి, అతని ఇంటిలో సోదాలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్కే మహమూద్, ఓ బాధితుడికి సంబంధించిన పెదవురా జమా మసీద్ సప్లమెంటరీ రిపోర్టును ఈఓకి ఇవ్వడానికి రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఈ విషయమై అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాధితుడి నుంచి వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహమూద్ రూ. 10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా దాడి చేసి, అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం మహమూద్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లంచం





తీసుకుంటూ దొరికిపోయిన ఇన్స్పెక్టర్ మహమూద్‌పై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, తదుపరి విచారణలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని మందుల వారి కాలనీలో గల అతడి నివాసంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశ కరపత్ర ఆవిష్కరణ

**పానగల్ రోడ్డు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు**

**జులై 5 న జరిగే నల్గొండ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం విజయవంతం చేయాలి**

**నల్గొండ జిల్లా కుమ్మర్లందరూ ఐక్యమత్యంతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలి**

**తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం**

**నల్గొండ జిల్లా కన్వీనర్ రాధారపు బిక్షపతి, కో – కన్వీనర్ గంగాధర వెంకటేశ్వర్లు**

**నల్గొండ జూన్ 06(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ ఆధ్వర్యంలో జులై ఐదున జరిగే నల్గొండ నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం కరపత్రాలను నల్గొండ పట్టణ కేంద్రంలో పానగల్ రోడ్డు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కరపత్రావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గం, నల్గొండ మండలం, నల్గొండ కార్పొరేషన్, తిప్పర్తి మండలం, కనగల్ మండలం కుమ్మర కులస్తులందరూ ఐక్యమత్యంతో జూలై 5 తారీఖున నల్గొండ పట్టణ కేంద్రంలో అశోక్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నల్గొండ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మనగోటి శ్యాంప్రసాద్ అధ్యక్షతన జరిగే నియోజకవర్గ సర్వసభ్య సమావేశానికి హాజరై, కుమ్మర హక్కుల సాధనకై ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టి ఆర్ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నడి కూడా జయంతి రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బండారు బిక్షపతి తో పాటు రాష్ట్ర బాధ్యులందరూ హాజరుకానున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో కుమ్మర్లకు మంచి అవకాశాలు, కుమ్మరవృత్తికి పూర్వైభం రానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రాధారపు బిక్షపతి, జిల్లా కోకన్వీనర్ గంగాధర వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి రమేష్, చిట్టిమల్ల దశరథ, కంచర్ల రాము, నిదానంపల్లి వెంకటస్వామి, కంభంపాటి సతీష్, చిట్టి మల్ల ఆంజనేయులు, ఆమంచి వెంకటేశ్వర్లు, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్చార్ ఎలిజాల వెంకన్న, కుమ్మర సంఘం నాయకులు నిమ్మనకోటి సత్తయ్య, చిగుళ్ల సుధీర్, గంగాధరి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.







# చిమిర్యాల ప్రభుత్వ హైస్కూల్‌లో ఘోర అగ్నిప్రమాదం!

### బుగ్గిపాలైన పాఠ్యపుస్తకాలు, రికార్డులు, ఫర్నిచర్

### షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు..

### విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం!





**కోదాడ రూరల్, జూన్ 6(ప్రజాజ్యోతి):**

చిమిర్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో శనివారం ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పాఠశాల గదిలో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ప్రమాదం జరిగిన సమయంలో పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని, అందరూ ఊపిరి పీల్చుకున్నారని స్థానికులు తెలిపారు.పాఠశాల భవనం నుండి దట్టమైన పొగలు, మంటలు రావడం గమనించిన గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాఠశాల గదుల్లో నిల్వ ఉంచిన నూతన పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల కీలక రికార్డులు, బెంచీలు, కుర్చీలు, కంప్యూటర్లు మరియు ఇతర ఫర్నిచర్ సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతై బూడిదయ్యాయి.

**సహాయక చర్యల్లో గ్రామస్థులు..**

అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలియగానే చిమిర్యాల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకుని సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. మంటలు పక్కనే ఉన్న ఇతర తరగతి గదులకు, కార్యాలయానికి వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పాఠశాల ఆస్తి నష్టం భారీగా జరిగినట్లు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి.ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌నే ప్రధాన కారణమని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి సాంకేతిక విచారణ అనంతరం ఖచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. ఘటన స్థలానికి చేరుకున్న విద్యాశాఖ అధికారులు ప్రమాద తీవ్రతను పరిశీలించి, నష్టానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు సైతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**సెలవులు కావడంతో ప్రశాంతత, లేదంటే ఊహించని నష్టం!**

విద్యార్థులకు సెలవులు కావడం వల్ల స్కూల్ ఆవరణలో పిల్లలు ఎవరూ లేరు. ఒకవేళ తరగతులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే పరిస్థితి అత్యంత ఘోరంగా ఉండేదని, దేవుడి దయ వల్ల పిల్లల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని గ్రామస్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనల మధ్యే ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బూడిదైన రికార్డులను, ఫర్నిచర్‌ను పునరుద్ధరించాలని పిల్లల తల్లిదండ్రులు  కోరుతున్నారు.

## గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం జరగాలి




**ఆలేరు జూన్ 6 ప్రజా జ్యోతి**

వీధి దీపాల నిర్వహణ మురికి కాలువల పూడికతీత ఆయిల్ బాక్స్ తయారీ శిథిలావస్తులు ఉన్న ఇండ్ల గుర్తింపు ఇలా గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం జరగాలని మండల తాసిల్దార్ ఆంజనేయులు అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి, టంగుటూరు ,షారాజీపేట గ్రామాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభల కార్యక్రమంలో వారు హాజరై మాట్లాడుతూ గ్రామసభలలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళిక అంశాలపై క్షేత్రస్థాయిలో వివరించారు. ఓటర్ల జాబితా జనగణన 2027 ఓటర్ల జాబితా సవరణ ప్రత్యేక కార్యక్రమం గురించి మాట్లాడారు. పంటల వికేంద్రీకరణ మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన తాగునీటి సరఫరా క్లోరినేషన్ పైప్ లైన్ లీకేజీల అరికట్టడంపై మాట్లాడారు. జల సంరక్షణ మన సంరక్షణలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ కట్టడాలు ఇంకుడు గుంతల ప్రాధాన్యతను వివరించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు వాటి నివారణకు కావలసిన ముందస్తు జాగ్రత్తలను తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ రోడ్డు ప్రమాదాల నివారణ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంతి మధు, ఉపసర్పంచ్ శ్రీధర్, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీ ఓ అనురాధ దేవి, ఏపీఓ అరుణకుమారి, ఆర్డబ్ల్యూఏఈ సుప్రియ, పంచాయతి రాజు ఏఈ నవ్య, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఆర్ ఐ పూర్ణచంద్రరావు ,భద్రయ్య, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు గ్రామ పంచాయత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ కేంద్రాల నిర్ణయం రద్దు చేయాలి - సీఐటీయూ

**భూదాన్ పోచంపల్లి, జూన్ 6(ప్రజాజ్యోతి)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రీ ప్రైమరీ (పీఎం శ్రీ) కేంద్రాల ఏర్పాటును రద్దు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వేతనాల పెంపు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఏరియర్లు, పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి, అంగన్‌వాడీ ఉద్యోగులు వసంత, పారిజాత, శోభ, పుష్ప, కల్యాణి, హేమలత, శివరాణి, కవిత, మంగ, పద్మ, భాగ్య, సువర్ణ, సంతోష  పాల్గొన్నారు.



## రైతులకు హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లు పండ్ల పంపిణీ

**ఆలేరు జూన్ 6 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులకు హమాలీలకు శనివారం గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గాజుల దశరథ, మాజీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, మల్లేష్ ,దీప, భాస్కర్, వెంకటేష్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు



## పారిశుధ్యంపై ఫోకస్.. వార్డు సభలో చర్చ

**భూదాన్ పోచంపల్లి, జూన్ 6(ప్రజాజ్యోతి):**

మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలోని సీతవానిగూడెం వద్ద శు




క్రవారం వార్డు సభ నిర్వహించారు. కౌన్సిలర్ దేవరాయ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026పై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ, వీధి దీపాల నిర్వహణ, ఇంకుడు గుంతల నిర్మాణం, వార్డు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలను విన్న అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు మద్ది మధుసూదన్ రెడ్డి, రెవెన్యూ అధికారి ఇన్‌చార్జ్ పి. ఆదిత్య, వార్డు అధికారి సుభాష్, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# కోదాడ మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు

## బోధకులు మరియు ఆయా పోస్టుల భర్తీకి ప్రకటన: జూన్ పదో తేదీ లోగా దరఖాస్తుల సమర్పణ ఎంఈఓ సలీం షరీఫ్

**కోదాడ రూరల్,జూన్ 5 , ప్రజా జ్యోతి:**

తెలంగాణ ప్రభుత్వం సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఆరు ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించనుంది. ఈ విభాగానికి సంబంధించి ప్రతి పాఠశాలలో ఒక పూర్వ ప్రాథమిక బోధకులు మరియు ఒక ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసినారు.?కాపుగల్లు లోని బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చిమిర్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రెడ్లకుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కోదాడ లోని ఆజాద్ నగర్ బాలికల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కోదాడ లోని శ్రీనగర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరియు నల్లబండగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఈ నూతన తరగతులు ప్రారంభం కానున్నాయి.దరఖాస్తుల స్వీకరణ ప్రారంభ తేదీ, జూన్ 6 నుండి ?దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ,జూన్ 10వ తారీకు వరకు స్వీకరించబడును.మండల ఎంపిక కమిటీ ద్వారా దరఖాస్తులు, జూన్ 11 తారీఖున పరిశీలన జరుగుతాయి.?పూర్వ ప్రాథమిక బోధకుల పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి రూపకల్పన చేసిన బాల్యదశ విద్య లేదా ప్రాథమిక విద్య బోధనలో డిప్లొమా అర్హతలు ఉన్న వారికి నియామకంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెలసరి వేతనంగా ఎనిమిది వేల రూపాయలు చెల్లిస్తారు. అలాగే ఆయా పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. వీరికి నెలసరి వేతనంగా ఆరు వేల రూపాయలు చెల్లించబడుతుంది.?అభ్యర్థుల వయస్సు పద్దెనిబిది నుండి నలభై నాలుగు సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోసడలింపు వర్తిస్తుంది. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఐదు సంవత్సరాలు, మహిళా అభ్యర్థులకు మూడు సంవత్సరాలు మరియు వికలాంగులకు పది సంవత్సరాల వయోసడలింపు ఉంటుంది.



ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే ఉంటాయి. ఒక విద్యా సంవత్సరంలో గరిష్టంగా పది నెలల కాలానికి మాత్రమే వీరు కొనసాగుతారు.?ఎంపిక విధానం మరియు దరఖాస్తు ప్రక్రియ ?ఈ పోస్టుల భర్తీలో స్థానికత ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మొదటగా అదే నివాస ప్రాంతం వారికి, ఆ తర్వాత అదే గ్రామ పంచాయతీ, ఆపై అదే మండలం మరియు అదే జిల్లా వారికి ప్రాధాన్యత క్రమం ఉంటుంది. అభ్యర్థుల తుది ఎంపిక జిల్లా స్థాయి కమిటీ ద్వారా జరుగుతుంది. అర్హత మరియు ఆసక్తి గల అభ్యర్థులు కోదాడలోని మండల వనరుల కేంద్రం కార్యాలయంలో పనిదినాల్లో, కార్యాలయ వేళల్లో నిర్ణీత దరఖాస్తు ఫారమును పొంది, పూర్తి చేసిన దరఖాస్తుకు తమ విద్యా అర్హతల నకలు పత్రాలను జతచేసి అక్కడే సమర్పించవలసి ఉంటుంది. సమయం తక్కువగా ఉన్నందున అర్హులైన స్థానిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసినారు.

# ఘనంగా ఐలయ్య జన్మదిన వేడుకలు



**ఆలేరు జూన్ 6 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ్రు జహంగీర్ ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారస్వామి, ఉపసర్పంచ్ బయన్న, వార్డు సభ్యులు ఉపాధి కూలీలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల జగదీశ్ కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే బాలు నాయక్

**కొండమల్లేపల్లి, జూన్ 6, (ప్రజాజ్యోతి):**

కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోట్ల జగదీశ్ కుమారుడు కోట్ల జతిన్ (13) గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శనివారం వారి స్వగృహానికి చేరుకొని చిన్నారి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే జతిన్ మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. కోట్ల జగదీశ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. జతిన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,



భగవంతుడు వారి కుటుంబానికి ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ఎం.ఏ. సిరాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గీత కార్మికుడిని పరామర్శ

**ఆత్మకూర్ ఎం జూన్ 6(ప్రజా జ్యోతి)**

ఆత్మకూరు మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఎరుకల సత్తయ్య గౌడ్ తాటి చెట్టు ఎక్కి తాడు గీస్తున్న సమయంలో వరి కోయ్యలకు పెట్టిన మంటలు ఒకేసారి ఎయిడ్స పడడంతో అతనికి అంటుకుని తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన వలిగొండ మండలంలోని రేణుక దేవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం మండల



అధ్యక్షుడు గడ్డం దశరథ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుండెగాని అయిలయ్య గౌడ్, గౌరవ అధ్యక్షుడు పంజాల నర్సయ్య గౌడ్ ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని సంఘం నాయకులు కోరారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధ మేకల కాపరి మృతి

**భూదాన్ పోచంపల్లి, జూన్ 6: (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్యామల రామస్వామి (80), మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మూత్ర విసర్జన కోసం ఇంటి బయటకు వెళ్లిన ఆయన, తిరిగి ఇంటికి వస్తూ రోడ్డు దాటుతుండగా జూలూరు వైపు నుంచి అలీనగర్ మీదుగా పెద్దగూడెం వైపు వెళ్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టింది. బైక్‌ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో రామస్వామికి రెండు కాళ్లు, ఎడమ చేయి విరగడంతో పాటు చెవి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్యామల బాలనర్సింహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం



నిమిత్తం ఆస్పత్రికి తరలించి, శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కొడుకు చెర నుండి ఇంటిని విడిపించి..వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేసిన జిల్లా కలెక్టర్

**మిర్యాలగూడ, జూన్ 06,( ప్రజాజ్యోతి ):**

కని... పెంచి.. పెద్దవాళ్లు గా చేసి ఆస్తులు పంచిన కన్న తల్లిదండ్రుల ఆలనా, పాలన చూస్తూ.. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కుమారుడే... వారు కట్టుకున్న ఇంటిని ఆక్రమించి.. ఇంటిలోకి రానీయకుండా వృద్ధ తల్లిదండ్రులను రోడ్డుపాలు చేసిన ఉదంతంపై ఫిర్యాదు అందుకున్న జిల్లా కలెక్టర్ వయోవృద్ధుల చట్టం ద్వారా న్యాయం చేసి కుమారుడి చెర నుండి ఇంటిని విడిపించి వారికి అప్పగించిన తీరుపై సర్వత్ర అభినందనలు వ్యక్తం అవుతున్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఇంజన్ చంద్రకళ,రమణారెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు. వారికి విద్యాభ్యాసం, పెళ్లిళ్లు బాధ్యతలన్నీ తమ రెక్కల కష్టం తోటే నెరవేర్చారు. వీరికి సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల మండలం, ఇంజన్ వారి గూడెంలో వ్యవసాయ భూమితో పాటు మిర్యాలగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇల్లు కలదు. కాగా ఐదేళ్లుగా అందులో నివాసం ఉంటున్న కుమారుడు తల్లిదండ్రులను ఇంట్లోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. 70 ఏళ్ల వృద్ధాప్యంలో పక్షవాతం, మోకాళ్ళ ఆపరేషన్, వయోభారంతో వచ్చే అనారోగ్య సమస్యలతో రోడ్డుపాలై సతమత మవుతున్న వృద్ధ దంపతులు సీనియర్ సిటిజన్స్ చట్టం ద్వారా ఆర్డిఓ ట్రిబ్యునల్ మరియు అప్పిలేట్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించడంతో వారి ఫిర్యాదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్పందించి వయోవృద్ధుల చట్టం -2007 ప్రకారం గత నెల 15వ తేదీన ఇంటిని వారికి స్వాధీన పరచాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఉత్తర్వులను మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయాలంటూ 23 తారీకున తిరిగి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల అమలులో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, వన్ టౌన్ సిఐ ఎం నాగభూషణరావు, తహసిల్దార్ పి.శ్రీనివాస్, రెవెన్యూ మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధులఎ సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది వృద్ధ దంపతులను వారి ఇంటిలోకి



పంపి ఇల్లు అప్పగించడం జరిగింది. ఈ సంఘటనపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, ఆర్ ఐ రామకృష్ణ, సిడిపిఓ ఆఫీస్ నుండి రాములు నాగిరెడ్డి,నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# పిల్లల భద్రత, విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

## ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్తూ

నల్గొండ జూన్ 06(ప్రజాజ్యోతి ప్రతినిధి): పిల్లలు సురక్షితంగా ఉంటేనే సమాజం సురక్షితంగా ఉంటుందని, ప్రతి తల్లి-తండ్రి పిల్లల భద్రత, విద్య, విలువల పెంపకానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్తూ అన్నారు. శనివారం ఆమె కనగల్లు మండలం, చెర్లగౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల పంచాయతీ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. చిన్నప్పటి నుండే పిల్లలకు విద్యతో పాటు, కష్టపడే తత్వం, నైతిక విలువలు నేర్పించాలని సూచించారు. భవిష్యత్తులో పిల్లలు కుకింగ్, కబడ్డీ, వాలీబాల్, క్రీడలు, కళలు తదితర అన్ని రంగాల్లో రాణించి దేశాభివృద్ధికి తోడ్పడతారని అన్నారు. దేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. బాల పంచాయతీలో విద్యార్థులు తమ గ్రామంలో ఉన్న సమస్యలను భయపడకుండా ధైర్యంగా ప్రస్తావించడం తనకు ఎంతో




ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. సమాజంలో మార్పు రావాలంటే పిల్లలు బాగా చదవాలని, తల్లిదండ్రులు వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రస్తుతం కాలుష్యం పెద్ద సమస్యగా మారిందని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు గ్రామంలో చెత్త సమస్య, పాఠశాలకు బస్సు సౌకర్యం, కొత్త పాఠశాల భవనం, ఆట స్థలం వంటి అవసరాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు చూపిన చొరవను అభినందించిన ఆమె, ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా పాఠశాల భవనానికి పెయింటింగ్ మరియు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పిల్లలు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని చెప్పాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ పోలీసు శాఖ చేపట్టిన బాల పంచాయతీ కార్యక్రమం విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికితీసే మంచి వేదికగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు ఎంతో



ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం అభినందనీయమని చెప్పారు. చదువుతో పాటు, కుకింగ్, వాలీబాల్, క్రికెట్ తదితర రంగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రస్తుతం 12 సంవత్సరాల వయస్సులో ఉన్న ఈ చిన్నారులే 2047లో స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలను చూసే భావితరమని, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ, బాల పంచాయతీ ద్వారా విద్యార్థులు గ్రామ సమస్యలను, తమ అవసరాలను నిర్భయంగా వెల్లడించారని చెప్పారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి బాల పంచాయతీ నిర్వహించి, విద్యార్థులు తెలిపిన సమస్యల పరిష్కారంపై సమీక్ష చేపడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన బాల పంచాయతీలో గ్రామంలో చెత్త సమస్యను నివారించాలని, బాల కార్మికత్వాన్ని అరికట్టాలని, పాఠశాలకు ఆట స్థలం, బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రతి చిన్నారికి విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు చూపిన చైతన్యం, ధైర్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సమావేశానికి. ఎ.ఎస్.పి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, డి.ఎస్.పి శివరాం రెడ్డి, సి డబ్ల్యూ ఓ చైర్మన్ చింత కృష్ణయ్య, ఎంపీడీవో వేద, సర్పంచ్ చిలకరాజు సునీత వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కల్యూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

## ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి కలెక్టర్ ఆరా

## అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి

## రోగుల అవసరాలకు అనుగుణంగా విభాగాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ జూన్ 06(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

శనివారం ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి కలెక్టర్ ఆరా తీశారు. మొదట సూపరింటీండెంట్ కార్యాలయంలో హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, అనంతరం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం సక్రమంగా అందుతోందా......? అవసరమైన మందులు అందిస్తున్నారా....? అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని మందులు అందుబాటులో లేవని రోగులు చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి సరఫరా పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో త్వరలో ప్రారంభించనున్న డి-అడిక్షన్ సెంటర్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా విభాగాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంసీహెచ్ (మాతా శిశు ఆరోగ్య) వార్డును సందర్శించిన కలెక్టర్, గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది తమను బాగా చూసుకుంటున్నారని వారు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలను వారి గర్భిణీ స్త్రీలను తీసుకువచ్చారు స్వస్థలాల గురించి అడిగి తెలుసుకున్నారు. మునుగోడు ప్రాంతం నుంచి వచ్చామని వారు చెప్పగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ఫార్మసీ విభాగాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్, మందుల నిల్వలు, పంపిణీ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి



వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ నేత నరసింహారావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్లు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.






# అనాజిపురంలో చోరీ - 12 తులాల వెండి - రూ.30 వేల నగదు అపహణ



**మోత్కూరు, జూన్ 6 (ప్రజా జ్యోతి):**

తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డ సంఘటన మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తాళం వేసి ఊరు వెళ్లిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితురాలు కొల్లు నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం ఆమె ఈ నెల 2న మంగళవారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్లో ఉన్న తన కుమారుడు కొల్లు నర్సింగ్ వద్దకు వెళ్లింది. శనివారం ఉదయం గ్రామానికి తిరిగి చేరుకుని ఇంటి వద్దకు రాగా మెయిన్ డోర్ తీసి ఉండడంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు కూడా తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి వెంటనే ఆమె గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు. శుక్రవారం రాత్రి చోరీ జరిగి ఉండవచ్చని ప్రాథమిక అంచనా కు వచ్చారు. ఈ చోరీ ఘటనలో బీరువాలో దాచి ఉంచిన 12 తులాల వెండి, సుమారు రూ. 30 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు కొల్లు నర్సమ్మ తెలిపింది. యాదాద్రి భువనగిరి జిల్లా క్లూస్ టీం ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.

# పట్టణంలో పారిశుద్ధ సమస్యలు రాకుండా చూసుకుంటా

## మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

**ఆలేరు జూన్ 6 ప్రజా జ్యోతి**

పట్టణంలో మంచినీటి సరఫరా తగ్గకుండా చూస్తూ పారిశుధ్య సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు పరిశోధిస్తానని ఆలేరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 4 5 6 వార్డులలో ముగింపు కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ జన సంజయ్ జల్ భగీరథ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట గుడికి కాలువల శుభ్రం చేయుట కూడిక తీయు పనులు వర్షాకాలం సంసిద్ధం పై కార్యాచరణ ప్రణాళిక మంచి నీటి సరఫరా నీరు నిల్వ




ఉండకుండా చూడడం రోడ్ల నిర్వహణ వీధి దీపాలు మొక్కలు మరియు పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలు పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, వార్డు కౌన్సిలర్ కళ్యాణి, సంపత్ కుమార్, మేనేజర్ జగన్మోహన్, పుష్ప సిబ్బంది వెంకటేష్ పవన్ కళ్యాణ్ రాజు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా గాధంశెట్టి శ్రీనివాసరావు



కోదాడ టౌన్, జూన్ 06 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ లో అసోసియేట్ కార్యవర్గ సభ్యుడిగా సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు గాధంశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ వాసవి భవన్ లో రాష్ట్ర కమిటీ నియామకల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.?ఈ సందర్భంగా గాధంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనకు ఈ నియామకంలో పూర్తి సహకారం అందించిన రాష్ట్ర మహాసభ సీనియర్ నాయకులు ఊరే లక్ష్మణ్, రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ ఛైర్మెన్ ఒరుగంటి ప్రభాకర్, జిల్లా మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు,మాజీ అధ్యక్షులు చల్లా రామమూర్తి, మాజీ అధ్యక్షులు మాశెట్టి అనంతరాములు,కోదాడ పట్టణ అధ్యక్షులు పైడిమరి నారాయణరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్యులను రాజకీయంగా చైతన్యవంతులను చేసేందుకు, మహాసభ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**– బిజెపి మండల అధ్యక్షుడు మేష్యా నాయక్**

దామరచర్ల, జూన్ 06,( ప్రజాజ్యోతి ):

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని దామరచర్ల మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు ధీరావత్ మేష్యా నాయక్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ పిలుపుమేరకు శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జనజీవన వ్యవస్థ మొత్తం పర్యావరణం పై ఆధారపడి ఉందని, అడవుల నరికివేతతో కాలుష్యం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి కాలుష్య రహిత భారతాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్నంత రెడ్డి అశోక్ రెడ్డి, మండల కార్యదర్శి నిమ్మల విజయ్, మోదాల కృష్ణంరాజు, జిల్లా నాయకులు మాదరబోయిన సత్యం, ఈగ సైదారావు, యామినూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# వార్డు సభలలో ప్రజలు పాల్గొని సమస్యలు మా దృష్టికి తేవాలి

**– మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నరసయ్య**




మోత్కూరు, జూన్ 6 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వార్డు సభలలో ప్రజలు పాల్గొని సమస్యలు తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నరసయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమములో భాగముగా శనివారం మోత్కూరు పురపాలక సంఘ పరిధిలోని 3, 4, 5 వ వార్డులలో వార్డు సభలు నిర్వహించారు. సాలిడ్ వెస్ట్ మేనేజిమెంట్ రూల్స్, 2026, జల్ సంచయ్ జల్ భగీరత పథకం క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట, మురికి కాలువల శుభ్రం చేయుట, పూడిక తీయు పనులు, వర్షాకాల సంసిద్ధత పై కార్యాచరణ ప్రణాళిక మంచి నీటి సరఫరా నిర్వహణ , నీరు నిలువ ప్రాంతాల నివారణ పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, వీధి దీపాలు , మొక్కలు పర్యావరణ సంరక్షణ కార్యక్రమములు అంశాలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఫిర్యాదుల పరిష్కారం అంశములపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ జి. నర్సయ్య , వార్డు కౌన్సిలర్లు, కొండ శోభ, సుల్తాన్ స్వామి, వార్డు అధికారులు నిఖిల్, మహేష్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యసభ స్థానాల్లో వికలాంగులకు అవకాశం కల్పించాలి..గిద్దె రాజేష్



మునగాల జూన్ 6 ప్రజా జ్యోతి

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో కనీసం రెండింటిని వికలాంగులకు కేటాయించి, వారి పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ప్రత్యేక లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెంలో జరిగిన సంఘం మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు తీవ్ర వైకల్యం ఉన్న వారికి రూ.15,000, ఇతర వికలాంగులకు రూ.6,000 పెన్షన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, అలాగే 'ఇంద్రధనస్సు' పేరుతో ఏడు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సంఘం తరపున అభినందిస్తున్నట్లు తెలిపారు. అయితే సంక్షేమ పథకాలతో పాటు వికలాంగులకు రాజకీయ సాధికారత కల్పించడం కూడా అత్యంత అవసరమని రాజేష్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా చట్టసభల్లో వికలాంగులకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల వారి సమస్యలు సమర్థవంతంగా పరిష్కారం కావడం లేదన్నారు. విద్య, ఉద్యోగాల్లో ఉన్నట్లుగానే చట్టసభల్లో కూడా ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తే వికలాంగులు సమాన అవకాశాలు పొందగలరని చెప్పారు. వికలాంగుల సమస్యలను అసెంబ్లీ, పార్లమెంట్ వేదికలపై బలంగా వినిపించాలంటే వారి ప్రతినిధులు చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాల్లో వికలాంగులకు అవకాశం కల్పిస్తే రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మునగాల మండల అధ్యక్షుడు గోపిరెడ్డి మదన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, రాష్ట్ర నాయకుడు కడియ నరేష్, జిల్లా అధ్యక్షుడు పసుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి..సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల, జూన్ 06 (ప్రజాజ్యోతి):

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై రూ.1,000 జరిమానా విధించడంతో పాటు మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, హెల్మెట్ వాడకం వల్ల ప్రమాద సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా రక్షణ లభిస్తుందని చెప్పారు.అదేవిధంగా వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, సందేశాలు చూడటం వంటి చర్యలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో క్షణకాలం ఏకాగ్రత కోల్పోయినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, అటువంటి ప్రమాదాల వల్ల వాహనదారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, ఇతర కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు మాత్రమే కాకుండా వెనుక కూర్చునే వ్యక్తులు కూడా హెల్మెట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ప్రాణ భద్రత కోసం హెల్మెట్‌ను అలవాటుగా మార్చుకోవాలని, రోడ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని సీఐ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.



# ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**నల్గొండ జూన్ 06(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

ఈ నెల 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు చెందిన ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, మహిళా సంఘాల ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వరి కొనుగోలు 95 శాతం పూర్తయిందని, మిగిలిన 5 శాతం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు దోహదపడే ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని



విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రత్యేక డిజైన్‌తో రూపొందించిన పాఠశాల యూనిఫార్ములను విద్యార్థులకు పంపిణీ చేయాలని అన్నారు.నీట్ యూజీ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, లైటింగ్, బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక



సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రానికి ఒక తహసీల్దార్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నామని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, జనరేటర్లు, జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డీఎం రాంపత్తి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ప్రచార కార్యదర్శిగా అస్లాం

**మిర్యాలగూడ, జూన్ 06, (ప్రజాజ్యోతి ):**

తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూ డబ్ల్యూజే- ఐజేయు) నల్గొండ జిల్లా ప్రచార కార్యదర్శిగా మిర్యాలగూడ కు చెందిన సీనియర్ రిపోర్టర్ ఎం డి ఫక్రుద్దీన్ (అస్లాం)ను ఎంపిక చేసినట్లు టీయూ డబ్ల్యూజే-ఐజేయు నల్గొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ప్రకటించారు.?నకిరేకల్ లో జరిగిన జిల్లామహా సభలో నల్గొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న మిర్యాలగూడ పట్టణానికి చెందిన అస్లాం ను జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎంపిక చేయటం యూనియన్ బలోపేతానికి మరింత తోడ్పడుతుందని జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి, వివిధ హోదాలలో ఉన్న యూనియన్ బాధ్యులకు అస్లాం కృతజ్ఞతలు తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ అస్లాం జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ పరిధిలోని పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



# సజీవ దహనమైన మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

## తక్షణ సాయంగా 20 వేల నగదు అందజేత

## ప్రభుత్వం ద్వారా అన్నివిధాలా ఆదుకుంటామని హామీ

**మిర్యాలగూడ, జూన్ 06,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణం లోని కల్వాడలో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ప్రమాదంలో దుర్మరణం పాలైన చంద్రమ్మ, లక్ష్మణ్, ప్రణీత భౌతిక కాయాలను శనివారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) సందర్శించి,పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.? అనంతరం ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.వారిని ఓదార్చుతూ,ఈ కష్టకాలంలో గుండె నిబ్బరంతో ఉండాలని మనోధైర్యాన్నికల్పించారు. అనంతరం అగ్నిప్రమాద తీవ్రతకు పూర్తిగా దెబ్బతిని ,కాలిబూడిదైన ఇంటిని ఆయన స్వయంగాపరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ప్రమాద ఉదంతాన్ని, బాధితుల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా మృతుల దహన



సంస్కారాల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# దత్తప్పగూడెంలో అంగన్వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మోత్కూరు, జూన్ 6 (ప్రజా జ్యోతి):**

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం – 2 భవనాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో ఖాళీగా ఉన్న టీచరు, ఆయా పోస్టులను త్వరలో ప్రభుత్వం భర్తీ చేయడానికి అన్ని రకాల ప్రణాళికలను పూర్తి చేసిందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టిక ఆహారము, ఇతర రకాలైన సేవలను వినియోగించుకోవాలని కోరారు. మాత, శిశు మరణాల నిర్మూలన కోసం ఐసిడిఎస్ శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఫ్రీ ప్రైమరీ స్కూలు పిల్లలకు యూనిఫార్మ్ ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక సర్పంచ్



గుండు యాదగిరి గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, తాసిల్దార్ పి. జ్యోతి, సిడిపిఓ నాజీ, సూపర్వైజర్ జ్యోతి, మాజీ సర్పంచ్ కంచర్ల యాదగిరి రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ శివకుమార్, ఉప సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సహజీవనం చేస్తున్న ప్రియుడే హంతకుడు

**- 24 గంటల్లోనే హత్య కేసు ఛేదన**

**- నిందితుడు బోయ కూలూర్ లింగప్ప అరెస్ట్**

**- మిర్యాలగూడ డి.ఎస్.పి వివరాల వెల్లడి**

**హాలియా,జూన్6(ప్రజా జ్యోతి)**

నల్లగొండ జిల్లా త్రిపురారం గ్రామ శివారులోని ఒక వ్యవసాయ బావిలో కుళ్ళిపోయిన స్థితిలో లభ్యమైన మహిళా మృదేహం కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు.ఎటువంటి ఆధారాలు లేని ఈ కేసును సవాల్ గా తీసుకున్న పోలీసులు



సాంకేతిక పరిజ్ఞానం పక్కా ప్రణాళికలతో కేవలం 24 గంటల వ్యవధిలోనే మృతురాలని గుర్తించడంతో పాటు నిందితుడిని అరెస్టు చేశారు.కేసుకు సంబంధించిన వివరాలను మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు విలేకరుల సమావేశంలో శనివారం వెల్లడించారు.

బావిలో కుళ్ళిన శవం... దర్యాప్తు ప్రారంభం

ఈనెల రెండవ తేదీన త్రిపురారం గ్రామ శివారులోని ఒక వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కుళ్ళిపోయిన స్థితిలో లభ్యమయింది.దీనిపై త్రిపురారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా జిల్లా ఎస్ పి ఆదేశాల మేరకు హాలియా సీఐ దేవి రెడ్డి సతీష్ రెడ్డి పర్యవేక్షణలో త్రిపురారం ఎస్ ఐ కే .నరేష్ పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు.

**సాంకేతిక ఆధారాలతో మృతురాలి గుర్తింపు**

పూర్తిగా కుళ్ళిపోయిన శవం వద్ద ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ కాల్ డేటా విశ్లేషణ స్థానిక సమాచారం మిస్సింగ్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ క్రమంలో మృతురాలు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలానికి చెందిన తిరుపతమ్మగా గుర్తించారు.వెంటనే మిర్యాలగూడ డి.ఎస్ పి రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో హాలియా సీఐ త్రిపురారం నిడమనూరు హాలియా ఎస్ ఐ లతో కూడిన ప్రత్యేక బృందాలు రాష్ట్రవ్యాప్తంగా మృతురాలు గతంలో నివసించిన ప్రాంతాలను జల్లెడ పట్టారు

**పెద్దవూర జంక్షన్ వద్ద నిందితుడి అరెస్ట్**

నిందితుడి కోసం గాలిస్తున్న క్రమంలో శనివారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు నిందితుడు తన స్వగ్రామం నుండి




గతంలో మృతురాలితో కలిసి నివసించిన గండి గనుముల ప్రాంతానికి వెళ్తుండగా ఉదయం 6 గంటల సమయంలో త్రిపారం ఎస్ ఐ నరేష్ పెద్దవూర జంక్షన్ వద్ద నిందితుడిని నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం పెద్దజత్రం గ్రామానికి చెందిన బోయ కూలూర్ లింగప్ప(26) గా గుర్తించారు.

**అక్రమ సంబంధం పెళ్లి కావడంతో గొడవలు**

పోలీసుల విచారణలో నిందితుడు లింగప్ప నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు ఒప్పుకోలు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఐదేళ్ల క్రితం తిరుపతమ్మ గొర్రెల మేపడం కోసం ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళినప్పుడు లింగప్ప తో పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారి తీసింది.ఈ విషయం భర్త కూరప్ప కు తెలియడంతో దేవరకద్ర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి భర్తకు అప్పగించారు. అయినప్పటికీ మారకుండా20 నెలల క్రితం తిరుపతమ్మ మళ్లీ ఇంట్లోంచి వచ్చేసి దుర్గి వద్ద లింగప్ప తో సహజీవనం ప్రారంభించింది.గత నెలలో లింగప్ప కు వేరే మహిళతో వివాహం కావడంతో వీరిద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో ఎలాగైనా తిరుపతమ్మను వదిలించుకోవాలని లింగప్ప ప్లాన్ వేశాడు.

**మాటల్లో దించి.. ఉరివేసి బావిలోకి నెట్టేసి..!!**

పథకం ప్రకారం మే 27 న లింగప్ప మాచర్ల వెళ్లి తిరుపతమ్మను తీసుకొచ్చాడు.కొండ మల్లేపల్లి, దేవరకొండ,మిర్యాలగూడ ప్రాంతాలలో తిరిగి చివరకు మే 29 న రాత్రి త్రిపురారం గ్రామంలోని సబ్ స్టేషన్ వెనుక వైపు గల బావి వద్దకు తీసుకువెళ్లాడు.అక్కడ ఆమెను మాటల్లో దించి ఆమె చున్నీతో రెండు చేతులను వెనుకకు కట్టేశాడు.ఆపై ఆమె చీర కొంగుతో గొంతుకు ఉరివేసి ఆ చీర రెండో చివరకు పెద్ద బండరాయిని కట్టి ప్రక్కనే ఉన్న బావిలో పడవేసి పారిపోయాడు.నిందితుడి వద్ద నుండి మృతురాలి సెల్ ఫోన్ తాళిబొట్టు ఇతర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.క్లిష్టమైన కేసును 24 గంటల్లోనే ఛేదించి నిందితుడు లింగప్పను అరెస్టు చేసిన మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు హాలియా సీఐ సతీష్ రెడ్డి ఎస్ఐలను నరేష్ విజయ్ కుమార్ ప్రశాంత్ పోలీస్ సిబ్బందిని ఎస్ పి శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.ఒంటరిగా నివసించే మహిళలు పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు అప్రమత్తంగా ఉండాలి సోషల్ మీడియా ఫోన్ల ద్వారా ఏర్పడిన పరిచయాలను నమ్మకూడదని డిఎస్ పి తెలిపారు.అనుమానస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే కుటుంబ సభ్యులకు గానీ పోలీసులకు గాని సమాచారం అందించాలని సూచించారు.

## వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**- పశువైద్య నిపుణుడు డా. పృథ్వీరాజ్**

భూదాన్ పోచంపల్లి, జూన్ 6(ప్రజాజ్యోతి):

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశుపాలకులు పశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశువైద్య నిపుణుడు డా. పృథ్వీరాజ్ సూచించారు. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటిని నివారించవచ్చని తెలిపారు. పశువుల షెడ్లను ముందుగానే శుభ్రపరచి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెమరేజిక్ సెప్టిసీమియా, బ్లాక్ క్వార్టర్, ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ వంటి వ్యాధుల నివారణకు అవసరమైన టీకాలు వేయించాలని



తెలిపారు. అలాగే పశువులకు పరిశుభ్రమైన తాగునీరు, సమతుల్య ఆహారం అందించడంతో పాటు గోమారులు, పేలు వంటి బాహ్య పరాన్నజీవుల నివారణకు తగిన మందులు వాడాలని సూచించారు. పశువుల్లో జ్వరం, మేత తినకపోవడం, నీరసం, కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలని డా. పృథ్వీరాజ్ పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పశుపాలకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## గొంగళ్ల సహకార సంఘం స్థలం చదును చేయడంపై ఆందోళన

**మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం**

**భూదాన్ పోచంపల్లి, జూన్ 6(ప్రజాజ్యోతి):**

పట్టణ కేంద్రంలోని ఉన్ని, గొంగళ్ల సహకార సంఘానికి చెందిన స్థలాన్ని ముందస్తు సమాచారం లేకుండా చదును చేశారని ఆరోపిస్తూ శనివారం సంఘ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

గత 70 సంవత్సరాలుగా తమ కులవృత్తికి సంబంధించిన గొంగళ్ల తయారీ పనులను ఆ స్థలంలో నిర్వహిస్తున్నామని, తమ జీవనాధారమైన స్థలాన్ని తమకు తెలియకుండా చదును చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తి వివరాలు సేకరించి, తమకు తగిన న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరారు. స్థలానికి సంబంధించిన పరిస్థితులను పరిశీలించి, సంఘ సభ్యుల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తంగేళ్ల దశరథ్, బుగ్గ లక్ష్మయ్య, మైల భీములు, కాలిన సత్యనారాయణ, గౌరిగే నరసింహ, బుగ్గ నాగేష్, కర్రే భాను, కౌడి రాజశేఖర్, రాసూరి సత్యనారాయణ, గౌరిగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# విత్తన దుకాణాలను తనిఖీలు చేసిన మండల వ్యవసాయ అధికారి, ఎస్ ఐ



**పాలకవీడు, జూన్ 6(ప్రజా జ్యోతి ):**

పాలకవీడు మండల పరిధిలోని విత్తన దుకాణాలను మండల విత్తన టాస్క్ ఫోర్స్ బృందంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి బి. కళ్యాణ్ చక్రవర్తి,పాలకీడు ఎస్ ఐ కోటేష్ లు శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జాన్ పహాడ్ గ్రామంలోని లక్ష్మీ శ్రీనివాస పెస్టిసైడ్స్ షాపును సందర్శించి, అక్కడ ఉన్న స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం దుకాణంలోని విత్తనాల ప్యాకెట్లను, ముఖ్యంగా పత్తి విత్తనాలను, వాటికి సంబంధించిన బిల్లులను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను కేవలం ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు దుకాణదారులు తప్పనిసరిగా రశీదులు (బిల్లులు) ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా రైతులు గుర్తింపు పొందిన అధికారిక డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోటేష్ మాట్లాడుతూ గ్రామాల్లోకి వచ్చి 'బీటీ-3 విత్తనాలు' అని నమ్మబలికి, నకిలీ విత్తనాలతో మోసం చేసే వారిని నమ్మి మోసపోవద్దు. అలాంటి వారి దగ్గర ఎలాంటి విత్తనాలు కొనకూడదన్నారు. రైతులందరూ విధిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. రాయితీపై జీలుగు విత్తనాలు అందుబాటులో కలవని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**పాలకవీడు, జూన్ 6(ప్రజా జ్యోతి ):**

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, జూన్ 5 తేదీన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా " ఏక్ పేడ్ మా కే నామ్ " మన అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో శనివారం రోజు పాలకవీడు బిజెపి పార్టీ మండల అధ్యక్షులు రమావత్ నరి నాయక్ ఆధ్వర్యంలో పాలకీడు మండల బిజెపి ఆఫీస్ ఎదురుగా అమ్మ పేరు మీద రెండు చెట్లు నాటడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కాటూరి శేషగిరిరావు, జిల్లా కౌన్సిల్ నెంబర్ గుండ్రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కుందూరు మట్టా రెడ్డి, బెజ్జం సైదులు, పాలకీడు బూత్ అధ్యక్షులు కొండ శ్రీనివాస్ గౌడ్, మహిళ మోర్చా మండల నాయకురాలు దిద్దకుంట్ల కళావతి రెడ్డి, మండల సీనియర్ నాయకులు గంద్ర కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.



# వికారాబాద్ డిపో నుండి నాగార్జున సాగర్‌కు ప్రత్యేక బస్సులు

**నాగార్జున సాగర్ జూన్ 6 ప్రజా జ్యోతి**

వికారాబాద్ ప్రయాణికుల సౌకర్యార్థం నాగార్జున సాగర్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో అధికారులు తెలిపారు,శనివారం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 5:00 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది అక్కడి నుండి నాగార్జున సాగర్‌కు ఉదయం 11:00 గంటలకు సాగర్ చేరుకుంటుంది అలాగే రెండవ బస్సు ఉదయం 6:30 గంటలకు బయలుదేరి,వయా హైదరాబాద్ మీదుగా ఉదయం 8:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది,అక్కడి నుండి మల్లేపల్లి మీదుగా మధ్యాహ్నం 12:00 గంటలకు నాగార్జున సాగర్ చేరుకుంటుంది

అలాగే మళ్ళీ తిరిగి మొదటి బస్సు

నాగార్జున సాగర్ నుండి ఉదయం 11:15 గంటలకు బయలుదేరుతుంది,రెండవ బస్సు నాగార్జున సాగర్ నుండి మధ్యాహ్నం 12:30 గంటలకు బయలుదేరుతుంది. ఈ బస్సుల సర్వీసులు ఆధార్ కార్డు చూపిస్తే మహిళలకు ఉచితంగా మహాలక్ష్మి పథకం వర్తిస్తుంది ప్రయాణించే వెసులుబాటు ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ నుండి హైదరాబాద్ వెళ్ళే ప్రజలందరూ ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో అధికారులు తెలిపారు,హైదరాబాద్‌లోని వివిధ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు

వైద్య పరీక్షలు మరియు వ్యాపార అవసరాల నిమిత్తం వెళ్లే సాగర్ పట్టణ ప్రజలకు ఈ బస్సుల సమయాలు ఎంతో అనుకూలంగా ఉన్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగార్జున సాగర్




నుండి హైదరాబాద్ వెళ్లే ప్రజలు,విద్యార్థులు అందరూ ఈ సువర్ణ అవకాశాన్ని,ఆర్టీసీ కల్పిస్తున్న ఈ ప్రత్యేక బస్సు రవాణా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో అధికారులు కోరారు.

# కేసును ఎత్తివేయాలని డీఎస్పీకి ఏఐవైఎఫ్ వినతి

**మర్రిగూడ, జూన్ 6 (ప్రజాజ్యోతి):**

ఏఐవైఎఫ్ మండల కార్యదర్శిపై అక్రమంగా నేరారోపణలు చేసి,కేసులు నమోదు చేయించిన వారిపై తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన దేవరకొండ డీఎస్పీని కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ భూబాధితులు స్వయంగా విడుదల చేసిన వీడియోలను, పత్రికల్లో ప్రచురితమైన వార్తలను సామాజిక మాధ్యమాల్లో ఫార్వర్డ్ చేసినందుకు ఏఐవైఎఫ్ మండల కార్యదర్శిపై కేసు నమోదు చేయడం అన్యాయమని ఆరోపించారు. ఈ చర్య ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధమని ఆయన ఆరోపించారు. బాధితుల వాదనలను




వార్తగా ప్రచురించడం,సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం ఏమాత్రం నేరం కాదని, కేసులు నమోదు చేయడం అంటే భావ ప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా అణిచివేయడమే అని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేసే ప్రయత్నాలను తాము ఏమాత్రం సహించబోమని ఆరోపించారు. వారిపై పెట్టిన అక్రమ కేసును తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శి ఎం. యాదయ్య,ఏఐవైఎఫ్ మర్రిగూడ మండల సహాయ కార్యదర్శి పొట్ట అశోక్, మైలారపు గిరి, ఇతర ఏఐవైఎఫ్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

### ధర్మోజీగూడెంలో ధాన్యం సేకరణ వేగవంతం

### రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగానే గోదాము ఏర్పాటు

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సర్పంచ్ జువ్వి నర్సింహ్మా

చౌటుప్పల్, జూన్ 6 ( ప్రజా జ్యోతి ): రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ధర్మోజీగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా తెలిపారు. శనివారం ధర్మోజీగూడెం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ....ధాన్యం సేకరణ వేగంగా సాగుతోందని, త్వరలోనే పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ముగుస్తాయని పేర్కొన్నారు.రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం నిల్వలకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పరిధిలోనే గోదాం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, బత్తుల శ్రీహరి, రాచకొండ భార్గవ్, పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# రాహుల్ ని కలిసిన రాజగోపాల్ రెడ్డి

**మంత్రి పదవి కోసమే రాహుల్ ను కలిసినట్టు ప్రచారం..!?**

**మూడోసారి విస్తరణలో మంత్రి పదవి వరించేనా..!?**

**రాజగోపాల్ రెడ్డి ఎదురుచూపులు ఫలించేనా..?**

**సంస్థాన్ నారాయణపురం,**

జూన్ 06, (ప్రజాజ్యోతి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఢిల్లీలో శనివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కలవడంతో రక రకాల ఊహాగానాలు ప్రచారాలు జరుగుతున్నాయి. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ నే తప్ప ఇతర విశేషాలు ఏమి లేవని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అనుచరులు వివరిస్తున్నారు. కానీ త్వరలో జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవిని ఇవ్వాలని రాహుల్ గాంధీని కలిసి కోరినట్లుగా మరో వైపు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నది. ఇప్పటికే రెండుసార్లు మంత్రివర్గ విస్తరణ జరిగింది. 7 డిసెంబర్ 2023 లో మొదటిసారి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తో పాటు మరో పదకొండు మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. 18 నెలలకు జూన్ 2025 లో మొదటిసారి జరిగిన మంత్రివర్గ విస్తరణలో మరో ముగ్గురికి అవకాశం లభించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా అక్టోబర్ 2025లో అజారుద్దీన్ ను ఒక్కరినే మంత్రివర్గంలోకి రెండోసారి తీసుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండుసార్లు మంత్రులుగా ప్రమాణ స్వీకారాలు చేసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి అవకాశం దక్కలేదు. రాష్ట్రంలో మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మంత్రి పదవులను త్వరలో భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నది. ఈసారైనా మంత్రివర్గంలో చోటు దక్కాలని కోరికతో రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీని కలిసినట్టుగా ప్రచారం జరుగుతున్నది.

**మంత్రివర్గంలో స్థానం కోసం రాజగోపాల్ రెడ్డి పోరాటం**

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2023 లో జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు బిజెపి పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే మంత్రివర్గంలో అవకాశం ఇస్తామని ఏఐసీసీ నాయకులు హామీ ఇచ్చినట్లుగా ప్రచారం జరిగింది. మొదటిసారి ప్రభుత్వం ఏర్పడిన సమయంలో రాజగోపాల్ రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అవకాశం లభించింది. ఇద్దరు అన్న తమ్ములకు ఒకేసారి మంత్రి పదవులు ఇవ్వలేమని అప్పట్లో అధిష్టానం చెప్పినట్లుగా తెలుస్తుంది. రెండోసారి విస్తరణలో అవకాశం లభిస్తుందేమోనని ఎదురుచూసిన రాజగోపాల్ రెడ్డికి నిరాశే మిగిలింది. దీనితో ఒకంత అసహనానికి లోనైన రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై పలుమార్లు విమర్శనాస్త్రాలను ఎక్కిపెట్టారు. కొన్ని సందర్భాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను సైతం బహిరంగంగా వ్యతిరేకించారు. నిధుల పైన పదవుల పైన ప్రశ్నించారు. కానీ ఉన్నట్టుండి గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విమర్శలు పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి భోజనం చేశారు. అప్పటినుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించడం మాని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేస్తూ వస్తున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో జరుగుతున్న ఆలస్యానికి ప్రభుత్వం తరఫున రైతులను క్షమాపణలు కోరారు. నిత్యం ప్రభుత్వాన్ని తప్పుపట్టే రాజగోపాల్ రెడ్డిలో వచ్చిన ఈ మార్పు వెనక మంత్రి పదవి వస్తుండటమే కారణమని మరోవైపు ప్రచారం జరుగుతున్న ది. మంత్రివర్గ విస్తరణ జరిగితే ఈసారి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి లభిస్తుందని ఆయన అనుచరులు సైతం నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి వస్తుందా లేదా అన్నది త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో తేలే అవకాశాలు ఉన్నాయి.



# రైతు మహోత్సవానికి భారీ గా తరలిన రైతులు

## జెండా ఊపి బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, జూన్ 06,( ప్రజాజ్యోతి ):**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు మహోత్సవం కార్యక్రమానికి శనివారం నియోజకవర్గం నుండి రైతులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. రైతులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన 8 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్). ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోహెడలో జరుగుతున్న రైతు మహోత్సవం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి క్లస్టర్ నుండి ఎంపిక చేసిన రైతులను బాధ్యత అధికంగా బస్సులో తరలించామని తెలిపారు. రైతు మహోత్సవం వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి తరలించేందుకు




రైతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి, స్వయంగా జెండా ఊపి పంపించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ ను రైతులు అభినందించే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి ఋష్యేంద్రమణి, కాంగ్రెస్ నాయకులు ఆలగడప గిరి, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మహిళా పథకాలు ఎలా అమలు చేస్తారు

**- ఐద్వా 2 టౌన్ కార్యదర్శి పాదూరి గోవర్ధన**

**మిర్యాలగూడ, జూన్ 06,( ప్రజాజ్యోతి ):**

రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మహిళా పథకాలు ఎలా అమలు చేస్తారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) టూ టౌన్ కార్యదర్శి పాదూరి గోవర్ధన అన్నారు. శనివారం మహిళ డిక్లరేషన్ అమలు, మహిళల సమస్యలు, సంక్షేమ పథకాలపై ఐద్వా ఆధ్వర్యంలో సర్వేను మిర్యాలగూడ పట్టణం చైతన్యనగర్ లో చేపట్టారు. ఈ సందర్భంగా గోవర్ధన మాట్లాడుతూసమభావన సంఘాల ద్వారా మహిళలనులక్షాధికారులుగా చేస్తామని చెప్పి మహిళా సంఘాలకు తగిన ఆర్థిక సహాయం అందించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి



హామీలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా డిక్లరేషన్ ప్రకటించి పథకాల అమలుకు అవసరమైన నిధులు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించకుండా హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజల జీవితం భారంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనాలోచిత విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పదేపదే పెంచడం వలన రవాణా చార్జీలు కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనెలు ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని బియ్యం మాత్రమే కాకుండా పప్పులు చక్కెర చింతపండు కందిపప్పు వంట నూనెలు సబ్బులు 14 రకాల నిత్యావసర వస్తువులు రేషన్ షాపు ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పళ్ళ నిర్మల, మేక బుజ్జమ్మ, కడియం సరోజ పాల్గొన్నారు

# ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు

**ఆలేరు, జూన్ 6(ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు శనివారం ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం హైదరాబాద్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి వారి ఆశీస్సులు అందుకున్నారు.



యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ గజమాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జన్మదిన వేడుకల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేయడంతో పాటు పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యవసాయ రుణమేళా




**మిర్యాలగూడ, జూన్ 06,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణంలో శనివారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నల్గొండ మిర్యాలగూడ,నిడమనూరు మల్లెపల్లి బ్రాంచ్ ల వారి సహకారంతో వ్యవసాయ రుణమేళ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రైస్ మిల్ అసోసియేషన్ ఇండస్ట్రీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎ డి శ్రీనివాస్ మాట్లాడుతూదేశవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 114 సంవత్సరాల నుంచి భారతదేశంలో వ్యాప్తంగా సేవలను అందిస్తూ రైతులకు, వ్యాపారవేతలకు ప్రొడ్యూసర్లకు, మరియు రైస్ మిల్ లకు, కోల్డ్ స్టోరేజ్, ఫుడ్ ప్రాసెసింగ్ వారికి అతి తక్కువ వడ్డీ రేట్లు కల్పిస్తూ, కొత్త కొత్త స్కీంలతో రుణాలను ఇస్తూ వారి అభివృద్ధికి బాటలు వేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అదేవిధంగా ఎస్ హెచ్ జి మెంబర్స్ కు, చిన్న తరహా వ్యాపారులు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు వాణిజ్య వ్యాపారవేత్తలకు, రైతు సంబంధిత వ్యాపార వర్గాలకు, వరంగల్ రీజనల్ వ్యాప్తంగా 110 కోట్ల రుణాలను అందజేశాం అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజన్ మేనేజర్ రాజ్ కుమార్ , జనరల్ మేనేజర్ ఏడి శ్రీనివాస్, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ గౌరు దయాకర్ ,మిర్యాలగూడ బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ మల్లెపల్లి, నల్గొండ బ్రాంచ్ మేనేజర్లు, బిజెపి వార్డు కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు,మేకల శీను తదితరులు పాల్గొన్నారు.

# కన్నెబోయిన లింగయ్య మృతి బాధాకరం.

## కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్.

**నడిగూడెం, జూన్ 6 ,ప్రజా జ్యోతి:**

మండల కేంద్రానికి చెందిన కన్నెబోయిన లింగయ్య మృతి బాధాకరమని కోదాడ మాజీ శాసనసభ్యులు బోల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం మృతుని పార్థివ దేహం పై పూలమాలలు వేసి సంతాపం తెలిపి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దాసరి శ్రీను, ఉద్యమకారులు దున్న ప్రవీణ్, ఎండి రఫీ , మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్కే జలీల్, మేకల గంగరాజు, మేకల వీరబాబు, వల్లెపు శ్రీను, గుండు శ్రీను, ఉదయ భాస్కర్, మండవ అనిల్, ఎండి మౌలానా, తిరుమలి, కొత్తపల్లి అజయ్. బడుగుల వెంకటేష్, గుంజ పెద వెంకన్న తదితరులు పాల్గొని నివాళులర్పించారు



# చెర్లగౌరారంలో ఘనంగా బాల పంచాయతీ కార్యక్రమం..

## పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం..

## ఉమెన్స్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డిజిపి అభిలాషా బిష్త్

## గ్రామస్థాయి నుంచే పిల్లలకు ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించాలి..

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

## బాలల భద్రత, విద్య, మానసిక అభివృద్ధి కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోంది..

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



**కనగల్ జూన్ 6, (ప్రజా జ్యోతి ):**

నల్లగొండ జిల్లా కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్, కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, బాలల భద్రత, గ్రామాభివృద్ధి వంటి పలు సమస్యలపై తమ అభిప్రాయాలను అధికారుల ముందు ధైర్యంగా వ్యక్తపరిచారు. అతిథులు మాట్లాడుతూ.. పిల్లల రక్షణ కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు.గ్రామస్థాయి నుంచే పిల్లలకు ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించి, వారిని భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. బాలల భద్రత, విద్య, మానసిక అభివృద్ధి కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో యంగిస్థాన్, ఆశ్రిత ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొని బాలల హక్కులు, సురక్షిత బాల్యంపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, ఎంపీడీఓ వేద రక్షిత, సీఐలు, ఎస్ఐలు, స్థానిక సర్పంచ్ వెంకన్న ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు
మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.









# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఘన సన్మానం

## – జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొయ్యడ లింగస్వామి గౌడ్

చౌటుప్పల్ జూన్ 6 ( ప్రజా జ్యోతి ): ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు శనివారం యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం కాంగ్రెస్ నాయకుడు కొయ్యడ లింగస్వామి గౌడ్ కార్యకర్తలతో



కలిసి బీర్ల ఐలయ్యను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగస్వామి గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాసేవలో బీర్ల ఐలయ్య మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రవ్వ సంతోష్, వర్కాల శ్రవణ్‌కుమార్, అల్మాస్పేట గౌతమ్, ఏలే మురళీ, సాయి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...

హుజూర్ నగర్, జూన్ 06 (ప్రజా జ్యోతి):

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని హుజూర్నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.శనివారం పట్టణంలోని గోవిందాపురంలో 8, 9 వార్డుల పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నిటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో హుజూర్నగర్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వెల్లడించారు.రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పేదల సంక్షేమానికి సన్న బియ్యం పథకమును ప్రవేశపెట్టారని తెలిపారు.పేదలకు గ్యాస్ సబ్సిడీ ఉచిత బస్సు రవాణా సౌకర్యం ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. స్మశాన వాటిక పనులు చేపడుతామని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

గోవిందపురం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

కమ్యూనిటీ హాల్లో ఫ్యాన్లను ఏర్పాటు చేసేందుకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ హాలుకు వెంటనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.


గోవిందపురంలో అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి , చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మరియు వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు , కమిషనర్ సతీష్ , సహాయ సహకారాలు అందించాలని 8 వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను కోరారు.ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 30 లక్షలు, ప్రభుత్వ పాఠశాల పనులకు అదనంగా మరో 20 లక్షలు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్మశాన వాటిక అభివృద్ధికి 40 లక్షల రూపాయలు నిధులుమంజూరు చేయాలన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు, కమిషనర్ సతీష్ కుమార్, ఏఈ వినోదు, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, విద్యుత్ ఖ.ఎ. రాంప్రసాద్, ఆయుష డాక్టర్ చందన్ కుమార్, ఇందిరాల రామకృష్ణ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాజశేఖర్, వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# నేడు ఉచిత మెగా క్యాన్సర్ క్యాంపు

## ప్రజలందరు ఉచిత మెగా క్యాన్సర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

## స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ వారిచే ఉచిత మెగా క్యాన్సర్ క్యాంప్





**చండూరు, జూన్ 6( ప్రజా జ్యోతి):-**

చండూరు మున్సిపాలిటీ లో గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు సహకారంతో ఆదివారం నాడు స్టార్ హాస్పిటల్స్ హైదరాబాదు వారిచే చండూరు వాస్తవ్యులు డాక్టర్ చిలుకూరి రామకృష్ణ ప్రసాద్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శిరీష బ్రెస్ట్ శస్త్ర శిక్షిస్తా నిపుణులు చే ఉచిత మెగా క్యాన్సర్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమం నందు సాధారణ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్, తల, మెడ క్యాన్సర్ లాంటి వాటిని స్క్రీనింగ్ ఇట్టి క్యాన్సర్ పరీక్షలకు విరామయి స్కాన్, పాప్ సమీర్ టెస్ట్, వి ఐ లాంటి టెస్టులు అవసరమైన వారికి ఉచితంగా అందించబడతాయి.

ఈ క్యాంపు నందు సిగరెట్, బీడీ అలవాటు ఉన్నవారికి, పాన్, గుట్కా, జర్దా, వక్కలు నమిలే వారికి, కుటుంబంలో క్యాన్సర్ హిస్టరీ ఉన్నవారు, రక్తహీనత కలిగిన వారు, మలంలో రక్తము లేదా రక్త చారికలు వచ్చేవారు, అధిక మలబద్ధకం ఉన్నవారు, ఆకలి మందగించడం, బరువు తగ్గేయడం, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడేవారు, రెగ్యులర్గా ఆల్కహాల్ తీసుకునేవారు, మూత్రంలో రక్తం పడేవారు, అధిక తలనొప్పి, వాంతులు, చూపు మందగించడం మొదలైన లక్షణాలు ఉన్నవారు ఈ క్యాంపు నందు డాక్టర్లను సంప్రదించాలని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరి వెంట కర్నాటి శ్రీనివాసులు, చిలుకూరి అశోక్ లు ఉన్నారు.

# వైరస్ సోకిన వీధి కుక్కలకు ప్రత్యేక చికిత్సలు ప్రారంభం



**బ్లూ క్రాస్ వ్యవస్థాపకులు అక్కినేని అమల**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూన్ 06(ప్రజాజ్యోతి):సూర్యాపేట పట్టణంలో మెంజ్ వైరస్ సోకి చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధి కుక్కల చికిత్సకు బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకులు అక్కినేని అమల


ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఇటీవల వీధి కుక్కల చర్మవ్యాధులు,ప్రజల్లో నెలకొన్న ఆందోళనపై స్పందించిన బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ షెల్టర్ డైరెక్టర్, సి.ఎఫ్.ఓ ఎన్.ఎస్.కె కుమారి బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల ఆదేశాల మేరకు వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు.పట్టణంలో ఇప్పటివరకు 194 వైరస్ సోకిన కుక్కలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.వాటి చికిత్స కోసం సుమారు రూ.1.80 లక్షల విలువైన ఇంజెక్షన్లు,మందులను అమల హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు పంపించారు.జిల్లా బ్లూ క్రాస్ వాలంటీర్,కాంగ్రెస్ నాయకుడు నరేందర్ నాయుడు గురువారం ఈ మందులను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చారు.హైదరాబాద్‌కు చెందిన బ్లూ క్రాస్ వాలంటీర్లు లాలు,నరేష్ ప్రత్యేక వైద్య బృందంతో కలిసి కుక్కలకు చికిత్సలు అందించేందుకు సూర్యాపేటకు చేరుకున్నారు.శనివారం నుంచి పట్టణంలోని 48 వార్డులలో వైరస్ సోకిన కుక్కలను గుర్తించి దశలవారీగా వైద్య చికిత్సలు అందించనున్నట్లు నరేందర్ నాయుడు తెలిపారు.ఇటీవల బ్లూ క్రాస్ బృందం ప్రత్యేక వలల సహాయంతో చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కలను పట్టుకుని వాటి రక్త నమూనాలను సేకరించిన విషయం తెలిసిందే.నమూనాల పరీక్షా ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణ చేపడతామని అధికారులు పేర్కొన్నారు.ప్రస్తుతం బాధిత కుక్కలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు అందజేస్తూ చికిత్స కొనసాగిస్తున్నట్లు తెలిపారు.వీధి కుక్కలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, జంతు జనన నియంత్రణ కార్యక్రమాలు, రేబిస్ నిరోధక టీకాలు, వైద్య చికిత్సల ద్వారానే సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని బ్లూ క్రాస్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదీ,కమిషనర్ సి.హెచ్.హన్మంతరెడ్డి,వైస్ ఛైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,వార్డు కౌన్సిలర్లు కోడి శిరీష శివ ,స్థానిక కాంగ్రెస్ నేతలు గుంటి సైదులు,అక్కినపల్లి జానయ్య ,యాట వెంకన్న ,పొలాగాని కృష్ణ,నరేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం సహాయ నిధి

## –రెండో వార్డ్ కౌన్సిలర్ కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్

హుజూర్ నగర్ జూన్ 06 (ప్రజా జ్యోతి)

అనారోగ్య కారణాలతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రెండో వార్డ్ కౌన్సిలర్ కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్ అన్నారు. శనివారం రెండో వార్డ్ మల్లన్న నగర్‌కు చెందిన వంగాల జ్యోతి అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందగా, వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.51,000/- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కౌన్సిలర్ లబ్ధిదారులకి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ రిలీఫ్ చెక్కులను అందించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమాలు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం... భారీ అగ్ని ప్రమాదం

చింతలపాలెం, జూన్ 6 (ప్రజా జ్యోతి): చింతలపాలెం, మేళ్లచెరువు రోడ్డులో పెద్ద కాలువ సమీపంలోని చార బయోమాస్ స్టాక్ పాయింట్ వద్ద శనివారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టాక్ పాయింట్‌లో మొత్తం ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిల్వ ఉంచిన పత్తి కట్టల కుప్పకు ఒక్కసారిగా మంటలు అంటుకుని వేగంగా వ్యాపించాయి. మంటల ధాటికి దట్టమైన పొగలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. రోడ్డు పక్కనే మంటలు వ్యాపించడంతో కొంతసేపు వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. దీంతో చింతలపాలెం మేళ్లచెరువు రహదారిపై రాకపోకలు బంద్ అయ్యాయి. సమాచారం అందుకున్న చింతలపాలెం తహశీల్దార్



బుసిరెడ్డి రామక్రిష్ణరెడ్డి, ఎస్సై పరమేష్, మేళ్లచెరువు ఎస్సై నవీన్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేపట్టినా ఎండాకాలం కావడం తో పాటు పత్తి కట్టకుప్పలు మధ్య గ్యాప్ లేకపోవడంతో అదుపు చేయడం సాధ్యపడలేదు. కాగా అగ్నిప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు.

# గిరి వికాసం

గిరిజనులను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకురావడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. చెంచులు, ఎస్టీల బీడు భూములను సాగుకు యోగ్యంగా మార్చేందుకు వాటిలో ఉచితంగానే బోర్లు తవ్వించి మోటరుతోపాటు పైపులు, విద్యుత్తు సరఫరాను కల్పించాలనే ఉద్దేశంతో గిరి వికాసం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఐదు ఎకరాలకుపైగా భూములున్న గిరిజనులను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా ఎంపిక చేసింది. అయితే ఈ పథకంలో భాగంగా జిల్లాకు ప్రభుత్వం రూ. 2.88 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటివరకు రూ. 2.51 కోట్లను అధికారులు గిరిజన భూముల అభివృద్ధి కోసం ఖర్చు చేశారు. జిల్లావ్యాప్తంగా 228 బ్లాక్‌లను గుర్తించి 1,474 ఎకరాలను గిరి వికాసం పథకం అమలుకోసం ప్రతిపాదనలు పంపగా.. 180 బ్లాక్‌ల్లోని 1,200 ఎకరాలకు మాత్రమే సర్వే ప్రక్రియ పూర్తైంది. ఇప్పటివరకు 107 బ్లాక్‌ల్లోని 747 ఎకరాలకు సంబంధించి 326 మంది గిరిజన రైతుల భూముల్లో బోర్లు వేయించి.. మోటర్లు బిగించి, విద్యుత్తు సరఫరా కల్పించి అధికారులు సాగుకు యోగ్యంగా మార్చారు. కాగా జిల్లాలో ఎంపిక చేసిన బ్లాక్‌ల్లోని గిరిజనుల భూములను సాగులోకి తెచ్చేందుకు వారు చర్యలను ముమ్మరం చేశారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు 1,20,652 మంది ఉన్నారు. ఈ పథకంలో రూపాయి ఖర్చు లేకుండానే బీడు భూములు సాగులోకి వస్తుండడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన తెగలకు చెందిన ఎస్టీ, చెంచులను ఆర్థికం గా బలోపేతం చేయడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టారు. ఇప్ప టికే గిరిజనుల సంక్షేమానికి ఎన్నో రకాల ప్రభు త్వ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వారి భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు గత ప్ర భుత్వం గిరిజనుల బీడు భూముల్లో బోర్లు త వ్వించి బోరు మోటరుతోపాటు విద్యుత్తు లైన్ వే సి వాటిని సాగుకు యోగ్యంగా మార్చాలనే ఉద్దే శంతో గిరి వికాసం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. బోరు తవ్వించడంతోపాటు బోరు మోట రు, పైపులు, విద్యుత్తు లైన్ తదితరాలన్నీ గిరిజన రైతులకు ఉచితంగానే కల్పిస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూన్ 06(ప్రజాజ్యోతి):ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చివ్వెంల మండలం గుంజలూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట






మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు, అంతర్గత రహదారుల నిర్మాణం, త్రాగునీరు ఎర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ శిరీష, డిపిఓ యాదగిరి, డిఇఓ సులోచన రాణీ, తహసీల్దార్ చంద్ర శేఖర్, ఎంపీడీవో సంతోష్ సర్పంచ్ సైదులు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

